

తమిళనాడులోని సవిత ఇంజనీరింగ్ కళాశాలలో డాక్టరేట్ పట్టాను అందుకున్న ఖాదర్ ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకుడు ముస్తఫా

## ఇంజనీరింగ్ అధ్యాపకుడికి డాక్టరేట్

- విద్యుత్ ఉత్పత్తి, విద్యుత్ పంపిణీపై పరిశోధన

దేవరకొండ, డిసెంబర్ 10: స్థానిక ఖాదర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్ అధ్యాపకుడిగా పని చేస్తున్న ముస్తఫాకు డాక్టరేట్ ప్రదానం చేశారు. శనివారం తమిళనాడుకు చెందిన సవిత ఇంజనీరింగ్ కళాశాలలో వైస్ చాన్సలర్ రంగనాథ్ డాక్టరేట్ పట్టాను అందజేశారు. ఈ సందర్భంగా ముస్తఫా మాట్లాడుతూ విద్యుత్ ఉత్పత్తి, విద్యుత్ పంపిణీపై పరిశోధనలు చేసినట్లు తెలిపారు. డాక్టరేట్ పట్టాను అందుకోవడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ముస్తఫాను ఖాదర్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ ఖలీల్, అధ్యాపకులు ఆదివారం ఆయనను అభినందించారు.

## వ్యవసాయ మోటర్ల సర్వీస్ వైర్లు చోరీ

- రైతులకు రూ.4లక్షల వరకు నష్టం

పెద్దఅడిశర్లపల్లి డిసెంబర్10: ఏఎమ్మార్పీ ప్రాజెక్టు పరిధిలోని డిస్ట్రిబ్యూటరీ 7 వెంబడి ఉన్న వ్యవసాయ మోటర్ల సర్వీస్ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. రైతులు తెలిపిన వివరాల మేరకు.. కాల్వకు ఇరువైపుల దాదాపు 2 కిలోమీటర్ల మేర ఉన్న దాదాపు 100మంది రైతులకు చెందిన వైర్లను స్టార్టర్ పెట్టె నుంచి కాల్వ లోపల మోటార్ వరకు ఉండే విలువైన తీగను కట్ చేశారు. తిరిగి వాటిని అదే కాల్వ వెంబడి కాల్చి అందులో ఉండే విలువైన అల్యూమినియం కాపర్ బయటకు తీశారు. ఈ తీగలు దాదాపు ఒక్కొక్క రైతుకు మూడు నుంచి నాలుగు వేల వరకు విలువ ఉంటుందని వాపోయారు. దీంతో రైతులు దాదాపు రూ.4లక్షల వరకు నష్టపోయినట్లు సమాచారం. రైతులు పోలీసులకు సమాచారం అందించడం తీగలు చోరీకి గురైన ప్రాంతాన్ని వారు పరిశీలించారు. గతంలో కూడా ఇదే కాల్వ వెంబడి వ్యవసాయం మోటర్లు, తీగలు చోరీకి గురి కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

## అటవీ ప్రాంతాభివృద్ధికి కృషి

- ఎఫ్ఆర్ఓ సాయిప్రకాశ్

చందంపేట, డిసెంబర్ 10: మండలంలోని నల్లమల అటవీ ప్రాంతాభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు ఎఫ్ఆర్ఓ సాయి ప్రకాశ్ అన్నారు. ఆదివారం మండలంలోని చిత్రియాల, పెద్దమూల ప్రాంతాల్లో ఉన్న అటవీ ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పలు అభివృద్ధి పనులను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. పాలపేడలోని అటవీ ప్రాంతంలో వన్య ప్రాణుల సంరక్షణ కోసం వసతులను పర్యవేక్షించారు. అటవీ ప్రాంతంలో ఉన్న జంతువులను వేటాడరాదని, అక్రమంగా కలపను తరలిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

## కోటి దీపోత్సవాన్ని విజయవంతం చేయాలి

- ఆర్య వైశ్య సంఘం రాష్ట్ర నాయకుడు లక్ష్మణ్

మాల్, డిసెంబర్ 10: కోటి దీపోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆర్య వైశ్య రాష్ట్ర నాయకుడు ఊరే లక్ష్మణ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం సాయంత్రం 6 గంటలకు చింతపల్లి మండలం గొడకొండ్ల పంచాయతీలోని రామలింగేశ్వర స్వామి దేవాలయంలో జగన్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో కోటి దీపోత్సవం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. గ్రామంలోని ప్రజాప్రతినిధులు, ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

## వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

వలిగొండ, డిసెంబర్10 : మండలంలోని సుంకిశాలలో వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని ఆదివారం వేద పండితులు వైభవంగా నిర్వహించారు. పైళ్ల సంజీవరెడ్డి దంపతులు పట్టు వస్త్రాలను, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. కల్యాణంలో జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ నూతి రమేశ్ రాజ్, జడ్పీటీసీ వాకిటి పద్మా అనంతరెడ్డి, ఏఎంసీ చైర్మన్ పైళ్ల రాజవర్ధన్‌రెడ్డి, సర్పంచ్ మొగిలిపాక నర్సింహ, ఉప సర్పంచ్ మెట్టు కొండల్‌రెడ్డి, తుమ్మల యుగంధర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ పైళ్ల ఉపేందర్‌రెడ్డి, చెరుకు శివయ్య, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



వేంకటేశ్వరస్వామి కల్యాణంలో పాల్గొన్న జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

# 25 ఫీట్ల లోతులోనే జలధార

- మూడించుల నీళ్లు పోస్తున్న బోరు

త్రిపురారం, డిసెంబర్ 10: మండలంలోని లోక్యాతండాకి చెందిన రైతు హన్మంతునాయక్ వ్యవసాయ పొలంలో 25 ఫీట్ల లోతులోనే ఆదివారం నీళ్లు పడ్డాయి. బోరు మూడించుల నీళ్లు పోస్తున్నాయని, దీని ద్వారా మూడు నుంచి ఐదెకరాల పొలం పండించుకోవచ్చని రైతు తెలిపారు. భూగర్భజలాలు ఇంతపైన ఉండడం ఆనందకర విషయమని అన్నారు. గ్రామంలో 30 నుంచి 45 ఫీట్ల లోపు ప్రతి రైతుకు బోరు పడుతుందని చెప్పారు. నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకుంటే భూగర్భ జలాలు ఇంకిపోవని రైతు హన్మంతునాయక్ పేర్కొన్నారు.



రైతు పొలంలో మూడించులు పోస్తున్న బోరు



పులిమామిడి వద్ద నిర్మించిన చెక్‌డ్యామ్‌లో పుష్కలంగా ఉన్న నీళ్లు

### చెక్‌డ్యామ్‌తో జలకళ

హాలియా: అనుముల మండలం పులిమామిడి గ్రామం వద్ద హాలియా వాగుపై చెక్ డ్యామ్ నిర్మాణంతో భూగర్భజలాలు పెరిగాయి. వాగులో నీటి నిల్వ పెరగడంతో పులిమామిడి, మారేపల్లి కేకేకాల్వ గ్రామాల్లో భూగర్భజల మట్టం సంవృద్ధిగా పెరిగింది. ఈ ఏడాది సాగర్ జలాశయానికి వరద రాకపోవడంతో ప్రభుత్వం ఎడమ కాల్వకు సాగునీరు విడుదల చేయలేదు. చెక్ డ్యామ్‌లో నీరు పుష్కలంగా ఉండటంతో రైతులు యాసంగిలో మళ్లీ వరి సాగుకు సిద్ధమయ్యారు.

# పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నాటి గురువులకు ఘన సన్మానం

త్రిపురారం, డిసెంబర్ 10: మండలంలోని పెద్దదేవులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996–97 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకొని కన్నీరు పెట్టుకున్నారు. ఎన్నో ఏండ్ల తర్వాత ఇలా కలుసుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. హెచ్ఎంలు రవికుమార్, వెంకట్‌రెడ్డి, రామచంద్రరావు, రమేష్, లక్ష్మీప్రసన్న, రజిత, నాగమణి, ప్రమీలబాయి, జయమ్మ, బచ్చు రంగయ్య, గోపగాని రాము, సైదులు, అంబటి వెంకన్న, చంద్రశేఖర్, నాతి రమేష్, అన్వర్, సురేందర్, రాజాబాబు, శ్రీను, రషీద్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



పెద్దదేవులపల్లి జడ్పీహెచ్ఎస్‌లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

## కార్యకర్తలు అధైర్యపడొద్దు

- ప్రజల మధ్య ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి
- బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు చందర్‌గౌడ్

ఆత్మకూరు(ఎం), డిసెంబర్ 10 : సాధారణ ఎన్నికల్లో ప్రజల తీర్పును బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు గౌరవించాలని, ఓడిపోయామనే భావనతో అధైర్యపడొద్దని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బీసు చందర్‌గౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అనుబంధసంఘాల బాధ్యులు నిత్యం ప్రజల వెంట ఉంటూ సమస్యల పరిష్కారంలో ముందుండాలన్నారు. రానున్న కాలంలో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ మండల సెక్రటరీ జనరల్ పంజాల వెంకటేశ్‌గౌడ్, మాజీ మండలాధ్యక్షుడు బాషబోయిన ఉప్పలయ్య, రైతు బంధు సమితి మండల కోఆర్డినేటర్ యాస ఇంద్రారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గడ్డం దశరథగౌడ్, కొరటికల్ సర్పంచ్ సత్తయ్యగౌడ్ పాల్గొన్నారు.

## భూమి కొంటానని నమ్మించి బంగారం చోరీ

- అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్
- 10లక్షల విలువైన ఆభరణాలు స్వాధీనం

భూదాన్‌పోచంపల్లి, డిసెంబర్ 10 : భూమి కొంటానని నమ్మించి బంగారం చోరీ చేసిన అంతర్రాష్ట్ర దొంగను భూదాన్‌పోచంపల్లి పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. ఎస్ఐ విక్రమ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. భూదాన్‌పోచంపల్లి మండలంలోని జలాల్‌పురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రాపోలు రామచంద్రం ఈనెల 8న అయ్యప్ప గుడి సమీపంలోని తన తోటకి వెళ్లి వస్తుండగా.. గుడి సమీపంలో శ్రీకాంత్ రాజు అనే వ్యక్తి ఎదురుపడి తాను రియల్ ఎస్టేట్ వ్యాపారినని ఇక్కడ అమ్మడానికి భూములు ఉన్నాయా అని అడిగాడు. రామచంద్రం తనకు సంబంధించిన భూమి ఉందని చెప్పి ఇంటికి వెళ్లి స్కూటీ తీసుకొచ్చి ఇద్దరు స్వామి రామానంద తీర్థ ఇన్‌స్టిట్యూట్ సమీపంలోకి వెళ్లారు. రామచంద్రం తన భూమిని చూపిస్తున్న క్రమంలో శ్రీకాంత్ రాజు బంగారం ఇవ్వకపోతే బండరాయితో కొట్టి చంపేస్తానని ఆయనను బెదిరించాడు. భయంతో రామచంద్రం తన దగ్గర ఉన్న 5 తులాల బంగారు గొలుసు, ఉంగరాలు ఇచ్చాడు. వెంటనే శ్రీకాంత్ రాజు స్కూటీ మీద కొత్తగూడెం వైపు వచ్చి అక్కడ పార్కు చేసిన తన కారులో వెళ్లిపోయాడు. రామచంద్రం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు సీసీ ఫుటేజ్, సెల్ సిగ్నల్ ఆధారంగా హైదరాబాద్‌లోని హబ్సిగూడలో శ్రీకాంత్ రాజుని అరెస్ట్ చేశారు. 10లక్షల విలువైన ఆభరణాలు, సెల్‌ఫోన్, కారుని స్వాధీనం చేసుకుని కోర్టుకు రిమాండ్ చేశారు. గతంలో శ్రీకాంత్ రాజుపై పలు చోరీ కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారం, సెల్ ఫోన్